# రమాబాయి అంబేడ్కర్

## జీవిత చరిత్ర



శాంతిస్వరూప్ బౌద్ధ్

# రమాబాయి అంబేడ్కర్

## జీవిత చరిత్ర

మూలం :

**శాంతిస్వరూప్ బౌద్ధ్**

**డా. జి. వి. రత్నాకర్**

హైదరాబాద్ బుక్ ట్రస్ట్


ధర : రూ. 40/-

మొదటి ముద్రణ : భేతాళ పబ్లికేషన్స్, హైదరాబాద్
హైదరాబాద్, 2008

HBT తొలి ముద్రణ : ఏప్రిల్ 2012

ప్రతులకు, వివరాలకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్,
ప్లాట్ నెం. 85, బాలాజీనగర్
గుడిమల్కాపూర్, హైదరాబాద్ – 500 006
ఫోన్ : 23521849
www.hyderabadbooktrust.blogspot.com

---

ముద్రణ : అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ,
126, శాంతినగర్, హైదరాబాద్ – 28
ఫోన్ : 23391364, 23304194
Email: anupamaprinters@yahoo.co.in



ఎడమవైపు నుంచి కూర్చున్నవారిలో రెండో వ్యక్తి రమాబాయి, బంధువులతో పాటు



కుటుంబ సభ్యులతో అంబేద్కర్, రమాబాయి, రాజగృహ, ముంబయిలో



## ముందుమాట

# భారతదేశ చరిత్రని తిరగరాసిన రమాబాయి...

డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ ఇల్లాలు రమాబాయి జీవన పోరాటాన్ని తెలిపే ఈ రచన కొంత ఆలస్యంగా వచ్చినా సాహిత్యలోకంలో ముఖ్యంగా జీవిత చరిత్రల కోవలో ఒక పెద్ద లోటును పూరించింది. దీనిని తెలుగు పాఠకులకు అందించిన డా॥ జి.వి. రత్నాకర్ గారు అభినందనీయులు.

శతాబ్దాలుగా వర్గ వర్ణ విభజనలతో అతలాకుతలంగా ఉన్న భారత సమాజ ధర్మాన్ని ప్రశ్నించి నిలదీసి సమధర్మం, సమన్యాయం ఏర్పాటుచేసిన మహనీయుడు డా॥ అంబేద్కర్. ఆయన భార్య, రమాబాయి జీవన గమనాన్ని అర్థం చేసుకుంటే, ఆమె కూడా ఆయన మార్గాన్నే ఆమోదించినట్లు స్పష్టపడుతుంది. పోరాటాలకు త్యాగాలకు బాధలు భరించటానికి మనిషి సిద్ధంగా ఉండాలనేవాడు ఆయన. ఆ మాటను రమాబాయి తన జీవితానికి ఎంతగా అనువర్తింప చేసుకున్నదో ఈ పుస్తకం విశదపరుస్తున్నది. హిందీలో ఈ రచన చేసిన శాంతి స్వరూప్ బౌద్ధ గారికీ ఆ రచనను తెలుగులోకి అంత సరళంగానూ హృద్యంగానూ అనువదించిన డా. జి.వి. రత్నాకర్ గారికి తెలుగు ప్రజలు ఋణపడ్డారు.

ఈ రచన తొలిముద్రణ 2008 లో వచ్చింది. దానికి నేనూ నాలాంటి వాళ్ళం మరికొందరమూ ముందు మాటలూ పరిచయ వాక్యాలూ రాశాం. రెండో ముద్రణ బాధ్యత హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ అధినేత్రి గీత తీసుకున్నారు. “రమాబాయిని పరిచయం చేసేది ఇలాగేనా”, అంటూ బాధపడ్డారు. నిజమే కదా అనిపించింది. అప్పటి నుంచీ రమాబాయి అంతరంగాన్ని సాక్షాత్కరింపజేసుకునేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నాం.

అట్టడుగు వర్గాల స్త్రీలకు నాగరిక సమాజంలో తగిన గౌరవమర్యాదలు లభించటం లేదన్న సత్యాన్ని ఆకళింపు చేసుకున్న అంబేద్కర్ ఆమెకు సామాజిక క్షేత్రంలో కీలకమైన బాధ్యతలు అప్పగించలేదు. కుటుంబబాధ్యతలు దారిద్ర్యం – పిల్లల మరణాలు – ఆమె ఆరోగ్యాన్ని దెబ్బతీయటం కూడా అందుకు కారణాలయ్యాయి. చాలా చిన్న వయసులోనే

ఇంటి కోడలిగా వచ్చిన రమాబాయి ఇంటి బాధ్యతను చాలా ఆనందంగా స్వీకరించింది. కుటుంబ సభ్యుల అవసరాలు, వారి మనోభావాలు అర్థం చేసుకుంటూ ఎదిగింది. జాతి అవసరాల గురించే తప్ప కుటుంబం గురించి ఆలోచించే సమయం డా॥ అంబేద్కర్‌కు లేదనీ, ఆయన లక్ష్యం వేరు అనీ అర్థం చేసుకుని ఆయన సహధర్మచారిణిగా ఆ బాధ్యతనంతా తనమీద పెట్టుకుంది.

“అంబేద్కర్ పై చదువులకు విదేశాలకు వెళ్ళినప్పుడు ఇక్కడ ఆయన కుటుంబ అవసరాలు ఎలా తీరాయి. ఇల్లు ఎలా గడిచింది ?” అనేది చాలా మందికి కలిగే సందేహం. ఆ సందేహానికి సమాధానం ఈ పుస్తకంలో దొరుకుతుంది. అంబేద్కర్ విద్యా వ్యాసంగం, సమాజ సంస్కరణ కార్యక్రమాలు, ఉద్యమాలు నిరంతరాయంగా సాగటానికి రమాబాయి ఎంతగా సహకరించిందో తెలుసుకునే కొద్దీ ఆశ్చర్యం కలుగుతుంది.

**“కార్యేషు దాసీ కరణేషు మంత్రీ...**
**షట్కర్మయుక్తా కులధర్మపత్నీ”**

అంటూ పెద్దలు స్త్రీ ధర్మాలను ఆరింటిని చెప్పారు. పనులు చేయటంలో దాసి, భోజనం తినిపించటంలో తల్లి, ఆలోచన చెప్పేటప్పుడు మంత్రి, శయ్యాగృహంలో రంభ సహనంలో (హింసను తట్టుకోవటంలో) భూమి, రూపంలో లక్ష్మీదేవి – ఇవీ భార్యకు ఉండాల్సిన లక్షణాలు. మగవారి జీవితం సుఖంగా గడవడానికీ వారి సమాజ జీవితానికీ అవసరమైనవి ఇవన్నీ. అప్పట్లో ఇవి సాధారణ స్త్రీ ధర్మాలు. అట్టడుగు వర్గాల కుటుంబాలలోని స్త్రీలకు వీటితో బాటు మరిన్ని పనులుంటాయి. కుటుంబ పోషణ భారం చాలా వరకు ఆ వర్గాల్లో స్త్రీల మీదనే పడుతుంది. అంబేద్కర్ కుటుంబనేపథ్యమూ ఇందుకు మినహాయింపు కాదు.

అట్టడుగు వర్గాలకు సంబంధించి భర్తల ఆదర్శాలు అర్థం చేసుకొని సహకరించవలసివచ్చే భార్యల కష్టాలు కొన్ని అయినా ఈ కథనంలో తెలుస్తున్నాయి. **రోజుల తరబడి పస్తులు ఉండటం – పిల్లల కడుపునింపలేని దారిద్ర్యం – జ్వరం వస్తే మందులు ఇప్పించలేని నిస్సహాయత** పిల్లలు ఒక్కొక్కరు మృత్యువు కోరల్లోకి పోతూ ఉంటే పడే క్షోభ – ఎంత దారుణమైన జీవితాలు వారివి ! జాతి సంక్షేమం కోసం స్వంత జీవితాన్ని, కుటుంబాన్ని సుఖాలకు దూరం చేసుకున్న అలాంటి జీవితాలు ఈనాటి సమాజానికి వింతగా అనిపించవచ్చు.

రమాబాయి కూడా మొదట్లో చాలా శ్రమ చేసి ఇల్లు గడిపింది. విద్యావంతుడూ స్ఫురద్రూపీ అయిన భర్త తనతో ఎక్కువ సమయం గడపనందుకు మొదట్లో బాధపడేది కోపగించుకునేది – దెబ్బలాడేది. ఆ తర్వాత ఆయన స్వభావము లక్ష్యము అర్థం చేసుకుని సహకరించింది. ఆయన మనసులో తన స్థానాన్ని కూడా ఆమె అర్థం చేసుకున్నది. ఇద్దరూ పట్టుదల గలవాళ్ళే. ఇద్దరూ స్వాభిమానపరులే. సర్దుకుపోవలసినది స్త్రీయే కాబట్టి రమాబాయి చాలా సర్దుకుపోయింది.



గాంభీర్యంలో పట్టుదలలో రమాబాయి, అంబేద్కర్ ఒకరికొకరు తీసిపోనివారే. వారు మన ఎదటికి వచ్చి తమ గురించి తామే చెప్పుకున్నా వారి మనస్సుల్లోని భావాలన్నీ మనకు తెలుస్తాయనుకోను.

భర్తతో పాటు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆమెకు ఉండేది. మహద్ ఉద్యమ సందర్భంలో తానూ వచ్చి కార్యకర్తల సౌకర్యాలు చూస్తానన్నది ఆమె. అంబేద్కర్ పడనివ్వలేదు. అగ్రవర్ణాల ప్రతిఘటనను ఎదుర్కొంటున్న తన కార్యరంగంలో చేరి రమాబాయి కూడా కష్టాలుపడడం అంబేద్కర్‌కు సబబుగా అనిపించలేదు. భార్యను శ్రమపెట్టకూడదను కొన్నాడు. గాంధీతో పాటు కస్తూర్బా లాగా ఉండే పరిస్థితి కింది వర్గాలకు లేదు. ఆర్థిక సామాజిక భద్రతా కారణాలు ఎన్నో ఉన్నాయి. రమాబాయికి ఇవన్నీ అర్థమయ్యాయి. ఉద్యమాలలో, సాంస్కృతిక సామాజిక, రాజకీయ కార్యకలాపాలలో, స్త్రీలను సమస్థాయిలో కలుపుకుని పోగలిగే సమాజం కోసంఆమె ఎంతగానో తపించింది. క్షోభ పడింది. అయినా సర్దుబాటు తత్వంతోనే వ్యవహరించింది. మనసారా తన విధులు నిర్వహించింది.

పరమయోగులకు దుర్లభమైన నిష్కామస్థితిని సాధించింది. జీవిత చరమదశలో ఆమె భర్తతో మాట్లాడిన మాటలే అందుకు నిదర్శనం.

జీవిత చరిత్రలు స్వీయచరిత్రలు ఏ భాషనైనా సంపన్నం చేస్తాయి. భిన్న రంగాలలో కృషి చేసిన వారి జీవిత ఘట్టాలు – వారి ఆలోచనలు – వేదనలు – స్పందనలు – ఇరుగు పొరుగులతో – సమాజంలో వారు మెలగిన తీరు – వారెదుర్కొన్న కష్టాలు, అవమానాలు, సమస్యలను వారు అధిగమించిన విధానాలు ఇవన్నీ తెలుసుకోవటం ద్వారా పాఠకులు తమ గమ్యాలను నిర్దేశించుకోగలుగుతారు. కల్పనా సాహిత్యంలోని పాత్రల అనుభూతుల కంటే యదార్థ జీవిత గాధలు పాఠకులకు మార్గనిర్దేశకం చేయగలుగుతాయి.

భారతదేశ ప్రాచీన సాహిత్యం మొదటి నుంచీ వర్ణ వివక్షను సిద్ధాంతీకరించి పోషించింది. మానవీయ విలువలను నిలబెట్టటానికి కృషి చేసిన వారి వివరాలు వెలుగుచూడడం తక్కువ. అందులోనూ అట్టడుగువర్గాల వారి చరిత్రలు అడుగునే ఉండి పోయాయి. ఈ దిశలో ఈ రంగంలో మరాఠీ సాహిత్యం ముందడుగు వేసింది. అట్టడుగు వర్గాల నాయకుల చరిత్రలూ వారి స్వీయ జీవిత కథనాలూ ప్రచురించి భావితరాల వారికి ఉత్తేజాన్ని కలిగించింది. ఆ సాహిత్యాన్ని అనువదించుకోవటం ఇతర భాషా సాహిత్యాలకు తప్పనిసరి. నాయకుల చరిత్రలతో బాటు వారి భాగస్వాముల గురించీ వారి నేపథ్యం గురించీ తెలుసుకోవటం యువతరానికి అవసరం.

ఈ పుస్తకం చదివేవారంతా అంతకు ముందు అంబేద్కర్ గురించి తెలిసిన వారే అయి ఉంటారు. ఆయన పట్ల ప్రగాఢమైన ఆరాధనా భావం పెంచుకున్నవారే అయి

ఉంటారు. ఆయన భార్యగా ఉండటం అనేది గొప్ప అదృష్టంగా భావిస్తుంటారు. రమాబాయి ఎంతో పుణ్యం చేసుకుంది, అందుకే అంతగొప్ప భర్త దొరికాడు అనేది వారి నిశ్చితాభిప్రాయం. "పుణ్యం కొద్దీ పురుషుడు దానం కొద్దీ బిడ్డలు" అనేది భారతదేశపు నానుడి. ఇవన్నీ పురుషులపరంగా వచ్చినవే.

అనుకూలవతి అయిన భార్య లభించటం పురుషుని అదృష్టం అని తెలిసినా దానిని ఒప్పుకోని సమాజం, అంబేద్కర్ జీవితంలో రమాబాయి పాత్ర గురించి ఎక్కువ ఆలోచించనివ్వలేదు. రమాబాయిని అర్థం చేసుకునే దిశగా ఆలోచనలు సాగలేదు. ఇప్పుడు ఆమె గురించి ఆలోచిస్తుంటే ఎన్నోన్నో భావాలు మనసును గందరగోళ పరుస్తున్నాయి. పుస్తకం చదవబోతున్న వారిని ఇతరేతర భావాలతో ప్రభావితం చేయరాదనే నియమానికి లోబడి నా పరిశీలనను అనుబంధంగా చదవవలసిందిగా కోరుతున్నాను.

రత్నాకర్ గారి కృషినీ అభినందించక తప్పదు.

రచనలో తెలుగు నుడికారాలు, వ్యక్తీకరణ, అతి సహజంగా ఉన్నాయి. రమాబాయి జీవితం గురించి మరింత పరిశోధన జరగవలసి ఉంది. మరిన్ని వివరాలతో ఈ రచన మలిముద్రణ కోసం పాఠకులు ఎదురు చూడాలని కోరుకుంటున్నాను.

**డా॥ బి. విజయభారతి**

**10.01.2012**



మహాపురుషులని మహోన్నతులుగా తయారుచేయడంలో వాళ్ళ ధర్మపత్నుల పాత్ర ఎంతైనా ఉంటుందని చెప్పవచ్చు. వాళ్ళు కేవలం జీవన సహచరులుగా, జీవితంలోని ఆటుపోట్లలో తోడుగా ఉండడమే కాకుండా వాళ్ళకి మానసికమైన బలాన్ని, ఉత్సాహాన్ని పెంపొందించే శక్తులుగా కూడా ఉంటారు. వాళ్ళు కఠినమైన, కష్టసాధ్యమైన సమయాల్లో బలాన్ని, ప్రేరణని కల్పిస్తారు. ధైర్యం, సాహసం కోల్పోయిన వేళ, నైతికమైన, మానసికమైన బలాన్ని కలిగిస్తూ జీవనగమనంలో చలించని స్థిరమైన సందేశాన్నిస్తారు. బాబాసాహెబ్ డా॥ అంబేద్కర్ జీవితాన్ని ప్రకాశవంతంచేసి, కష్టకాలంలో ఆయనకి అండగా నిలబడి అడుగడుగునా ఆయనకి ప్రోత్సాహాన్నందించి, ఆయన దినచర్యలోని సుఖదుఃఖాల్లో పాలు పంచుకొని నిరంతరం సహచర్యాన్నందించింది, ఆయన ధర్మపత్ని రమాబాయి.

రమాబాయి అంబేద్కర్ తన జీవితంలోని చివరి నిమిషాన్ని కూడామన విముక్తి ప్రదాత బాబాసాహెబ్ డా॥ అంబేద్కర్ జీవన ప్రస్థానంలోని ఆటంకాలను, ముళ్లను, రాళ్ళను తొలగించేందుకు వినియోగించింది. బాబాసాహెబ్‌ని కేవలం తనకే కాకుండా దేశానికే అత్యంత గౌరవమైన వ్యక్తిగా భావించేది. ఈ మహోన్నతమైన మహిళ ఒక శక్తి. ఆమె మహోన్నతమైన బలాన్ని, సంకల్పాన్ని కలిగించే స్త్రీ. అంతటి మహోన్నతమైన స్త్రీ పట్ల మనము నేడు అత్యంత గౌరవాన్ని ప్రకటిస్తూ ఆమెను 'రమామాత' అనే పేరుతో పిలుస్తున్నాం. అలాంటి మహోన్నతమైన స్త్రీ ఏ వీరనారికీ తీసిపోదు. ఆమె అమర జీవనం తెలుసుకుందాము.

గతంలో బాల్య వివాహాల ఆచారాలు ప్రబలంగా ఉండేవి. తొమ్మిది, పది సంవత్సరాల అతి చిన్న వయసులోనే రమాబాయి బాబాసాహెబ్ జీవితంలోకి ప్రవేశించింది. ఆ సమయంలో భీమారావు (బాబాసాహెబ్) ఐదవ తరగతి చదువుతూ ఉన్నాడు. వివాహం జరిగే సమయంలో భీమారావ్ వయసు కేవలం 14 సంవత్సరాలు ఉంది.

వివాహ సమయంలో అంబేద్కర్ ఆంగ్ల భాషా విద్యార్థిగా ఉన్నాడు. రమాబాయి పేరు వివాహానికి ముందు 'రామాబాయి'. ఆమె తండ్రి 'భికూ ధూత్రే' దాభోల్ దగ్గరలోని వణంద్ గ్రామంలో నివసిస్తూ ఉండేవాడు. మహారాష్ట్ర సాంప్రదాయానుగుణంగా వాళ్ళని 'వణంద్‌కర్' అని పిలుస్తూ ఉండేవారు. ఆయన దాపోలిలో కూలి పనిచేసి కష్టించి కుటుంబాన్ని పోషిస్తూ ఉండేవాడు. ఆయనకున్న నలుగురు సంతానంలో కేవలం ఒకడే కొడుకు, అతను అందరి కంటే చిన్నవాడు.

అందరికంటే పెద్ద కూతురు గౌరాబాయి కి చిన్నప్పుడే పెళ్లయి పోయింది. మిగిలిన వాళ్ళు ముగ్గురు రామీబాయి, మీరాబాయి మరియు శంకర్. వీళ్ళని భికూ ధూత్రే అతి కష్టంతో పెంచాడు. ధనం లేకపోవడంతో ఆయనకి రోజులు అతి కష్టంతో గడుస్తుండేవి. ఎందుకంటే ఆయన భార్య అప్పటికే చనిపోయింది. పిల్లలు అప్పుడు చాలా చిన్నవాళ్ళుగా ఉన్నారు. ఇక కుటుంబాన్ని నడిపే భారం అంతా అతని భుజస్కంధాలపై పడింది. ఆయన కూలి పనితో, సముద్రం నుండి బజారుకి వెదురు బుట్టతో చేపలు మోసే పనిచేసేవాడు. కూలికోసం చేసే ఆ పనిచాలా కష్టంతో కూడుకుని ఉండేది. బరువులు ఎత్తే ఆ కఠినమైన పని కారణంగా ఆయనకి తరచుగా గుండెల్లో నొప్పి వచ్చేది. తర్వాత ఆ నొప్పే ఆయన ప్రాణాన్ని బలి తీసుకుంది. భికూ ధూత్రే మరణించిన తర్వాత ఆయన కుటుంబం దిక్కులేనిదై పోయింది.

అనాధలైన పిల్లలకి చెడుకాలం దాపురించింది. వారి పోషణభారాన్ని వాళ్ళ చిన్నాన్న స్వీకరించాడు. వాళ్ళు భాయ్‌ఖల్లాలోని చేపల బజారు దగ్గర నివసిస్తూ ఉండేవారు. ఆయన పేరు శంకర్ ధూత్రే. ఆయన ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తూ ఉండేవాడు. ధూత్రేని వణ్‌కర్ అనే పేరుతో కూడా పిలిచేవారు.

ఇక్కడ భీమ్‌రావ్ అన్న ఆనందరావుకి వివాహం అయిపోయింది. ఇక కుటుంబంలో అందరూ భీవా (భీమ్‌రావ్) పెండ్లి గురించే ఆలోచిస్తున్నారు. సుబేదార్ రామ్‌జీ మనసులో భీవాకి కూడా పెండ్లి చేయాలనుకోసాగాడు.

భీవా, సోదరులందరిలోకి దీర్ఘకాయునిగా, అందంగా ఉండేవాడు. అందరికంటే చిన్నవాడు కావడంతో సుబేదారు భీవాని ప్రేమగా గారాబంగా చూసుకునేవాడు. భీవాకి భార్యని కూడా అతనికి సరిపోయే అందమైన గుణవంతురాలైన అమ్మాయిని చూసి చేయాలని ఆయన కోరిక. అలాంటి అమ్మాయి కోసం ఆయన వెతుకుతూ ఉన్నాడు.



ఆయన రమాబాయి కంటే ముందే ఇద్దరు అమ్మాయిలను చూసాడు. వాళ్ళ తల్లిదండ్రులతో కూడా సంబంధాన్ని నిశ్చయం చేసుకుంటానని కూడా చెప్పి ఉన్నాడు. కానీ ఆయన దృష్టి రమాబాయి మీద పడింది. ఆయనకి ఆమె బాగా నచ్చింది. మొదటి సంబంధాన్ని వదులుకోవడానికి ఆయన సిద్ధపడ్డాడు. తన తప్పు కింద కుల పంచాయితీ నిర్ణయానుసారం ఐదు రూపాయలు వాళ్ళకి చెల్లించడం కూడా జరిగింది. రామ్‌జీ సుబేదారు జరిమానా కట్టి కూడా రమాబాయిని కోడలిగా తన యింటికి తెచ్చుకోవాలనే నిర్ణయాన్ని మాత్రం వదలలేదు. సుబేదారు రామ్‌జీ దృఢసంకల్పం గలిగినవాడు. ఈ విధంగా రమాబాయి బాబాసాహెబ్ జీవితంలోకి ప్రవేశించింది.

వివాహ స్థలంగా భాయ్ ఖల్లా (ముంబయి నగర సబ్‌స్టేషన్) లోని చేపల బజారుని నిర్ణయించారు. అక్కడ ఖాళీ స్థలంలోని కప్పుకింద ఒకవైపు అమ్మాయి తరపు వారు, మరో వైపు అబ్బాయి తరపువారు జమ కూడారు. ఆ ప్రదేశంలో మురికి నీరు చెడువాసనతో ప్రవహిస్తూ ఉంది. అక్కడి అరుగును వివాహవేదికగా ఉపయోగించారు. ఆ బజారులోని అన్ని స్థలాలని వివాహ స్థలంగా ఉపయోగించారు. వివాహం ఆనందంగా, ఉత్సాహంగా జరిగింది. వివాహానికి వచ్చిన వ్యక్తులందరూ చాలా ఆనందించారు. ఉదయం చేపలవాళ్ళు వచ్చేకంటే ముందే వీళ్ళు ఆ స్థలాన్ని ఖాళీ చేయాల్సి ఉంది. చేపలవాళ్ళు వచ్చేలోపే వివాహ కార్యక్రమాలు చదివింపులు, అప్పగింతలు పూర్తి చేసారు. తెల్లవారగానే బంధువులందరూ తమ తమ ఇళ్ళకి బయలుదేరారు.



**రమాబాయి, భీమారావుల వివాహము భాయ్‌ఖల్లా దగ్గరి చేపల బజారులో ఒక కప్పు క్రింద జరిగింది.**

రమాబాయి చాలా సరళమైన, శాంతమైన మంచి గుణం కలిగినట్టిది. ఆమెకు కపటాలు, మోసాలు ఏమి తెలియవు. నిజాయితీయే ఆమె జీవితానికి పునాదిగా ఉంది. ఆమె చాలా అందమైనదే కానీ చదువుకున్నది కాదు. కానీ వాస్తవమేమంటే తెలివిలో, మేధోపరంగా చూస్తే బాబాసాహెబ్, రమాబాయిల జంట చాలా సరైనది. ఇదే బాబాసాహెబ్ జీవితపు గొప్పదనంగా చెప్పవచ్చు. ఆయన ఒక చదువులేని స్త్రీకి మంచి భర్తగా జీవితాన్ని కొనసాగించ గలిగాడు.

వివాహ సమయంలో బాబాసాహెబ్‌కి రమాబాయి నిరక్షరాస్యత గురించి బాగా తెలుసు. పెళ్ళి సంబంధాల్ని తల్లిదండ్రులు, సమాజంలోని చిన్న-పెద్దలు నిర్ణయిస్తూ ఉండేవారు. ఆ సమయంలో పెండ్లికుమారుడు, పెండ్లికూతుళ్ళ ఇష్టాయిష్టాలు ఏమీ ఉండేవికావు. వివాహ సమయంలో బాబాసాహెబ్ ఇలా నిశ్చయించుకున్నారు. అదేమంటే రమాబాయి చదువుకోకపోయినా ఫర్వాలేదు. నేనే స్వయంగా కష్టపడి ఆమెకు చదువు నేర్పుతాను. కనుకనే బాబాసాహెబ్ ఆ విషయంలో ఎప్పుడూ బాధపడలేదు.

భీమారావు రమాబాయికి చదువు నేర్పేందుకు స్వయంగా అనేక ప్రయత్నాలు చేశాడు. కానీ రమాబాయి చదువుకునేందుకు ఆసక్తి చూపలేదు. ఆమె ఆలోచనలో పెద్దల పట్ల ఆదర భావం కలిగి సేవలు చేయడం, భర్త మనసెరిగి మెసలడం, భర్తకోసం కర్పూరంలా తన జీవితాన్ని తాను సమర్పించు కోవడమే స్త్రీ నిజమైన కర్తవ్యాలుగా భావిస్తుండేది. ఈ విధమైన సంప్రదాయ బద్ధమైన ఆలోచనలతో స్త్రీ విద్య వైపు ఆమె మనసు లగ్నం కాలేదు. ఫలితంగా బాబాసాహెబ్ ఎంత ప్రయత్నించినా సామాన్యమైన అక్షరజ్ఞానం తప్ప ఆమె చదువులో ముందుకి వెళ్ళలేక పోయింది. ఆమె చాలాసార్లు ప్రాథమిక పుస్తకాలు, సంచీ, పలక తీసుకొని వెళ్ళేది. కానీ అవన్నీ వ్యర్థమయ్యేవి. రమాబాయి తాను అంతగా చదువుకోకపోయినా తన భర్త అపారమైన మేధాసంపత్తితో విద్యావేత్తగా ఉండటాన్ని చూసి మాత్రం చాలా సంతోషించేది, గర్వపడేది కూడా. బాగా చదువుకున్న ఆడవాళ్ళకి తన భర్త పాండిత్యాన్ని గురించి తెలియజేసి వాళ్ళని ఆశ్చర్యపరిచేది.

బాబాసాహెబ్ అనేకసార్లు ప్రాథమిక పుస్తకాలు తీసుకొని రమాబాయితో చదివించాలని ప్రయత్నించేవాడు కానీ అవన్నీ వ్యర్థమయ్యేవి. బాగా కష్టపడిన తర్వాత బాబాసాహెబ్ ఆమెకు సంతకం చేయడం నేర్పించారు. బాబా సాహెబ్ అమెరికాలో ఉన్న సమయంలో రమాబాయి పత్రికల్లోని పెద్ద పెద్ద అక్షరాలని చదవడం నేర్చుకుంది. అయితే అక్షరజ్ఞానంతో పోలిస్తే, రమాబాయి మానసికంగా చాలా తెలివైనది.

బాబాసాహెబ్‌ని ఆమె ఎల్లప్పుడూ 'సాహెబ్' అనే సంబోధనతో పిలుస్తూ తన గౌరవాన్ని వ్యక్త పరిచేది. బాబాసాహెబ్ కూడా ఆమెని ప్రేమగా 'రామూ' అని పిలుస్తుండేవారు. దూరప్రాంతాల్లో ఉన్నప్పుడు బాబాసాహెబ్ రాసే ఉత్తరాల్లో రమాబాయిని 'ప్రియమైన



రామూ' అని సంబోధించి వ్రాసేవారు. దీనిని బట్టి బాబాసాహెబ్‌కి భార్యపట్ల ఉన్న అంతులేని ప్రేమ, స్నేహం, సౌహార్ద్రతల గురించి అర్థం చేసుకోవచ్చు.

బాబాసాహెబ్ వివాహం రమాబాయితో జరిగిందనే విషయం మనకి కనిపిస్తుంది కానీ నిజానికి ఆయన వివాహం విద్యాసుందరితో జరిగింది. అత్యధిక సమయం ఆయన విద్యాధ్యయనంలోనే గడిపేవాడు. బాబాసాహెబ్ తన తుదిశ్వాస వరకు విద్యతో తన బంధాన్ని చాలా దృఢంగా పెనవేసి ఉంచారు. పగలైనా, రాత్రైనా, ఎండైనా, చలైనా, ఆరోగ్యంగా ఉన్నా లేక అనారోగ్యంతో ఉన్నా, ఆకలితో ఉన్నా లేక కడుపునిండా భోజనం చేసి ఉన్నా నిరంతరం ఆయన అధ్యయనంలోనే నిమగ్నమై ఉండేవాడు.



**భీమారావు రమాబాయిని చదివించేందుకు అత్యధికంగా ప్రయత్నించారు**

వైవాహిక జీవిత దాంపత్యసుఖంకై ఆయన ఎదురు చూడలేదు. నిజానికి ఆయన కుటుంబ సుఖసౌఖ్యాలకోసం వివాహం చేసుకోలేదు. శారీరక సుఖాన్ని ఆయన ఎన్నడూ ఎగతాళి చేయలేదు కానీ నిరంతరం దాన్ని తక్కువగానే చూశారు. ఆయన కేవలం ఒకే ఒక విషయం పట్ల వ్యామోహంతో ఉండేవాడు, అదే విద్య. బాగా చదవడం, జ్ఞానాన్ని సంపాదించుకోవడం. విద్యాభూషితునిగా ఉండడం అనే శబ్దం ఆయన మదిలో నిరంతరం ధ్వనిస్తూ ఉండేది. కనుకనే ఆయన గాంధీజీ వలె మానసికమైన అనేక వికారాలతో 'సత్యం'ను ప్రయోగించి చెడుకార్యాలకు ఒడిగట్టలేదు. ఆయన తన జీవితమంతా విద్యార్జన కోసమే గడపడం జరిగింది.

విద్యకి సంబంధించిన అనేకమైన ఉన్నత డిగ్రీలతో దూర దేశాలనుండి బాబా సాహెబ్ భారతదేశానికి తిరిగి వచ్చినప్పుడల్లా రమాబాయి మనసు పులకించి పోయేది. ఇక తమ మనసుకు నచ్చినట్లుగా తమ కుటుంబం సుఖసౌఖ్యాలతో ఉండవచ్చు అనే ఆలోచనతో, అనుభూతితో ఆమె ఉండేది. ఇక కష్టాల కడగండ్ల కాలం గడిచిపోయింది. తన భర్త ఒక మంచి ఉద్యోగం చేసి చాలినంత డబ్బు సంపాదిస్తాడు. అందరినీ ఆనందపరుస్తాడు. తమ జీవితం సుఖవంతంగా గడుస్తుంది అని అనుకునేది. ఆమెకు పిల్లలంటే అంతులేని ఇష్టం ఉండేది. తమ ఇల్లంతా పిల్లలతో నిండిపోతుంది అని ఆలోచించి ఆనందంతో ఉప్పొంగి పోయేది. ఈ విధమైన స్త్రీ సహజమైన కోరికలతో ఆమె మనసు మేల్కొనేది.

బాబాసాహెబ్ క్షేమంగా భారతదేశానికి తిరిగి రావడంతో రమాబాయి అధిక ఆనందం పొందింది. ఆమె ఆనందానికి మరొక కారణం కూడా ఉంది. అదేమంటే బాబాసాహెబ్ ఉన్నత విద్యకోసం విదేశాలకి వెళ్తూ ఉన్నప్పుడు ఆమె స్నేహితురాళ్ళు, ఇరుగు పొరుగువాళ్ళు 'రమా! డా॥ అంబేద్కర్‌ని విదేశాలకు వెళ్ళనీయకు. లేకుంటే ఆయన విదేశాలనుండి ఎవరో ఒక మేడమ్‌ని పెళ్ళిచేసుకొని తిరిగి రావచ్చు. అప్పుడు నువ్వు ఆమె మొహం చూస్తూ జీవితాంతం బ్రతకాల్సి వస్తుంది' అని అనేవారు. అప్పుడు రమాబాయి చాలా ధైర్యంగా తన భర్త పట్ల సంపూర్ణ విశ్వాసంతో "నాకు మా సాహెబు గురించి బాగా తెలుసు. మరొక స్త్రీ గురించి ఆయన ఎన్నడూ ఆలోచించడు" అని ఆమె సమాధానమిచ్చేది. బాబాసాహెబ్ యధావిధిగా విదేశాలనుండి తిరిగి వచ్చేసరికి రమాబాయికి బాబాసాహెబ్‌పై అంతులేని ప్రేమ, గర్వం కలిగింది.

అనుకున్న ఒప్పందం ప్రకారం బాబాసాహెబ్ బరోడా ప్రభుత్వంలో ఉద్యోగం కోసం వెళ్ళారు. చదువుకున్న వాడైనప్పటికీ ఆయన పట్ల కూడా అక్కడ అంటరానితనాన్ని ప్రదర్శించడం జరిగింది. అది ఆయనకు జీవితంలో ఎదురైన మొదటి విచిత్రమైన సంఘటన. అంటరాని తనం కారణంగా ఆయన బరోడాని వదలాల్సి వచ్చింది. మరొక ఉద్యోగం కోసం ప్రయత్నించడం మొదలు పెట్టాడు. ఆయన మధ్యలో ఆగిపోయిన చదువుని పూర్తి చేయాల్సి ఉంది. బాబాసాహెబ్ ఇంగ్లాండులో సగం చదువు ఆపి రావడం జరిగింది. ఇంగ్లండు తిరిగి వెళ్ళి చదువుకోవడానికి ఆయనకి డబ్బు అవసరమైంది. ఉద్యోగపు వెదుకులాటలో ఆయన బొంబాయి అంతా తిరగడం మొదలు పెట్టారు. చివరకు ఆయనకు బొంబాయిలోని సిడెన్ హోమ్ కాలేజిలో లెక్చరర్ ఉద్యోగం దొరికింది.

నేటికి తన భర్త సరైన రీతిలో కుటుంబ జీవనాన్ని గడపడానికి నిశ్చయించుకున్నాడు అని తలంచి రమాబాయి చాలా ఆనందపడింది. బాబాసాహెబ్ తనమొదటి జీతాన్ని రమాబాయి చేతిలో పెట్టినపుడు ఆమె ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఆమె



తన పిల్లలు, ఆడబిడ్డలు, తోడికోడలు, బంధువులందరికీ క్రొత్తబట్టలు కొనడం జరిగింది. ఇంటికి అవసరమైన గృహోపకరణాలు కూడా కొన్నది. మొదటి జీతాన్ని రమాబాయి వినియోగించిన తీరు చూచి బాబాసాహెబ్ ఆశ్చర్యపోయాడు. తర్వాత ఆయన ఆలోచనలో మునిగిపోయాడు. ఉద్యోగం ద్వారా వచ్చిన డబ్బుతో తన జీవన లక్ష్యమైన సగంలో ఆపి వచ్చిన చదువుని పూర్తి చేయాలని అనుకున్నాడు. ఆ చదువుకి ఆయన ఇంగ్లండు వెళ్ళి చదవాల్సి ఉంది. ఈ విధంగా అనవసరమైన రీతిలో ఇంతటి ఔదార్యంతో రమాబాయి ఖర్చు పెడుతూ పోతుంటే తాను నెరవేర్చాల్సిన ధ్యేయం ఎప్పటికీ సాధ్యం కాదు అని అనుకున్నాడు. అలా ఆలోచిస్తూ ఆయన రమాబాయితో ఇల్లు నడపడానికే ఖర్చు పెట్టమని చెప్పాడు. నేను ఉద్యోగం పూర్తికాలం కోసం కాదు కొంతకాలం వరకే చేస్తాను అని బాబా సాహెబ్ "రాము"కి చేస్తున్న ఉద్యోగం గురించి కూడా తన ఆలోచనని తెలియపర్చాడు. బాబాసాహెబ్ చెప్పిన ఈ మాటతో రమాబాయి ఆశలు, ఆకాంక్షలపై నీళ్ళు చల్లినట్లు అయింది. ఆమెకన్న కలలన్నీ పేకమేడలై కూలిపోయాయి. ఉద్యోగం కేవలం అధ్యయనం కోసం డబ్బు ఖర్చు పెట్టుకోవడం కోసమే. కుటుంబ సుఖసౌభాగ్యాల కోసం కాదు. బాబాసాహెబ్ మనసుని తెలుసుకున్న రమాబాయి ఆలోచనతో ఇలా అన్నది 'సాహెబ్! బాగా చదివి మీరేం చేయాలనుకుంటున్నారు? ఇప్పటికే చాలా చదివారు. మీ తలపైనున్న విద్యాభూతాన్ని క్రిందకి దించండి. నాలుగు వందలు, నాలుగువందలయాభై రూపాయలతో ఆనందంగా ఉండండి. కుటుంబంపట్ల మీరు కాస్త శ్రద్ధ చూపండి. మన చిన్న కుటుంబానికి ఆ మాత్రం ఉపయోగపడితే చాలు.

కానీ బాబాసాహెబ్‌గారి జ్ఞానతృష్ణ అద్వితీయమైనది. ఆ కారణంతో గృహస్థ జీవనం ఆయనకి చాలా అల్పంగా కన్పించేది. దాంతో రమాబాయి మనసులోని సుఖంగా గృహస్థ జీవనాన్ని గడపాలనే స్త్రీ సహజమైన ఆలోచనలు సగంలోనే ఆగిపోయాయి. మిగిలిన స్త్రీలు గడుపుతున్న సుఖవంతమైన కుటుంబ జీవితాన్ని వారి భర్తలు కుటుంబం పట్లచూపుతున్న శ్రద్ధని చూసి తన భర్త అలా ఎందుకు తనపట్ల, కుటుంబం పట్ల శ్రద్ధ చూపడంలేదని ఆలోచించడం మొదలుపెట్టింది? ఆ ప్రశ్న రమాబాయిని నిరంతరం వెంటాడుతూనే ఉంది. ఇంత చదువుకున్నా కూడా తాము అందరికన్నా ముందుకెళ్ళలేక పోతున్నామే అనే ఆలోచన రమాబాయి మనసుని నిరంతరం తొలుస్తూనే ఉండేది.

పుస్తకాలనుండి కాస్త దృష్టి మరల్చండి సాహెబ్, భార్యా బిడ్డల స్థితిగతులు, సుఖదుః ఖాల గురించి ఆలోచించండి అని రమాబాయి బాబాసాహెబ్‌తో అంటుండేది. ఈ పుస్తకాలు సైతానుల్లా పడి ఉన్నాయి అని, ఆమె అప్పుడప్పుడూ తిడుతూ ఉండేది. ఆ పుస్తకాలని చూస్తేనే ఆమె మనసుకి శూలంతో పొడిచినట్లు అనిపిస్తుండేది. కుటుంబ విషయాలు ఆయన వినడం మొదలు పెట్టేవాడు. వింటూ వింటూ ఆయన మౌనముద్రని దాల్చేవాడు.

ఇంట్లో యంత్రంలా పనిచేస్తూ ఉండేది. బాబాసాహెబ్ కూడా అంతే మొండిగా వ్యవహరించేవాడు. కొంత సమయం పాటు మౌనం రాజ్యమేలేది. తిరిగి ఆ మౌనం బాబాసాహెబ్‌ని బాగా బాధించేది. తిరిగి ఆయన రమాబాయిని మాట్లాడించేందుకు ప్రయత్నించేవాడు. రాత్రి నిద్రపోయే సమయానికి ఆ మౌనం ఓడిపోయేది. అప్పుడప్పుడు రాజీపడడానికి రమాబాయి వ్యతిరేకించేది. అప్పుడు బాబా సాహెబ్ ఆమెని తిడుతూ ఊరికే ఇలా బెదిరించేవాడు. "ఒకవేళ నువ్వు నా అధ్యయనం పట్ల ఈర్ష్య పడేటట్లయితే నేను మరొక పెళ్ళి చేసుకుంటాను". కానీ రమాబాయి ఆ బెదిరింపులకి భయపడేదికాదు. ఆమె వెంటనే ఇలా బదులిచ్చేది. "మీకెంత మంది భార్యలయినా ఉండనీయండి, కానీ నా ఇంట్లోకి మాత్రం వాళ్ళని అడుగు పెట్టనీయను". రమాబాయి చెప్పే ఈ గట్టి సమాధానంతో బాబాసాహెబ్ బెదిరింపు వ్యర్థమై పోయేది. హాస్యం, వినోదాలతో ఇరువురి మనసులు తిరిగి కలిసిపోయేవి.

చదువు గురించి రమాబాయి, బాబాసాహెబ్‌ల మధ్య వాదన జరుగుతూ ఉండేది. కానీ బాబాసాహెబ్ చదువుకోవడానికి ఎప్పుడు కూర్చుంటాడో అప్పుడు ఆయన అధ్యయనానికి మాత్రం ఆమె ఎలాంటి ఆటంకం కలిగించేది కాదు. ఆ విషయంలో మాత్రం ఆమె అప్రమత్తంగా ఉండేది. అల్లరిచేసే పిల్లలని బైటకి పంపించేది. లేదంటే అల్లరి చెయ్యవద్దని




**భార్య ప్రేమ, పుస్తకాల ప్రేమ రెండింటిలో దేనికి ప్రాధాన్యత నివ్వాలి – బాబాసాహెబ్‌కి ఈ ప్రశ్న నిరంతరం ఎదురయ్యేది.**



గట్టిగా హెచ్చరించేది. బాబాసాహెబ్ చదువుకునే సమయంలో ఆయన తిండి ఏర్పాట్లు అన్నీ చాలా ఏకాగ్రతతో చూసుకునేది. చదువుకునే సమయంలో బాబాసాహెబ్ లోపలినుండి తలుపు వేసుకునేవాడు. భోజనం సమయంలో బైటనుండి అరిచినా ఆయన జ్ఞాన సాధనకి భంగం కలిగేది కాదు. జ్ఞాన సాధనలో రేయింబవళ్ళు మునిగిపోయే బాబాసాహెబ్ అప్పుడప్పుడు ఆకలి విషయమే మర్చిపోయేవాడు. ఆయనతో పాటు రమాబాయి కూడా అప్పుడప్పుడు రాత్రంతా ఆకలితోనే ఉండిపోయేది. అలా అనేకసార్లు జరిగేది. కానీ రమాబాయి ఎప్పుడూ కూడా ఈ విషయాన్ని లెక్కచేయలేదు. భర్త ఆకలితో ఉన్నప్పుడు తను అన్నం తినడం సరైన విషయం కాదు అని ఆమె అనేది. ఈ నియమాన్ని రమాబాయి తన జీవితపు చివరి నిమిషం వరకు కొనసాగించింది. బాబాసాహెబ్‌కి పిక్కలు అంతులేని నెప్పితో బాధిస్తుండేవి. ఆయన చదువుకునే సమయంలో రమాబాయి నేలపై కూర్చుని బాబాసాహెబ్ కాలివేళ్ళు నొక్కుతూ ఉండేది. అదిచూసి బాబాసాహెబ్‌కి నవ్వు వస్తుండేది. 'రామూ' కాళ్ళు నొక్కుతూ, నొక్కుతూ ఆయన మోకాళ్ళపై తల ఆన్చి ఎప్పుడు నిద్రపోయేదో తెలిసేది కాదు.

బాబాసాహెబ్ అంతగా పట్టించుకోకపోయినా కూడా రమాబాయి తన సంసార నావని అత్యంత జాగురూకతతోనే నడిపించేది. భర్త విద్యాధ్యయనానికి డబ్బు మిగిల్చేది. దృఢ సంకల్పంతో నిండిన తన భర్త జ్ఞాన తృష్ణ తీరకుండా నిద్రపోడని ఆమెకు తెలుసు. బాబాసాహెబ్ ఇంటి ఖర్చులకోసం నెలకి 50 రూపాయలు రమాబాయికిఇచ్చేవాడు. రమాబాయి చదువుకోకపోయినా డబ్బు ఖర్చు పెట్టడంలో మాత్రంచాలా జాగ్రత్తపడేది. ఆమె నెలకి ఖర్చు పెట్టే పద్ధతి అపూర్వమైన రీతిలో, అద్వితీయంగా ఉండేది. ఆమె 1-50 రూపాయల 30 పొట్లాలు తయారు చేసిపెట్టేది. మిగిలిన ఐదు రూపాయలు అత్యవసర ఖర్చులకోసం వేరే పొట్లంలో దాచి ఉంచేది. కఠినమైన పరిస్థితులు ఏర్పడినా కూడా పొట్లంలోని డబ్బును ఉపయోగించేది కాదు. ఆ పొట్లాల్ని ఒక గుడ్డలో కట్టి దాచి ఉంచేది. ఈ విధంగా ఒకరోజుకి ఒక పొట్లం లెక్కన ఖర్చు చేసేది. అంతకంటే ఎక్కువ ఖర్చుకాకుండా సక్రమమైన రీతిలో ఆలోచించేది. బాబాసాహెబ్ గారి నిరంతర అధ్యయనం కారణంగా ఒకవైపు కోపంగా ఉండేది. మరొకవైపు మాత్రం తన భర్త చదివిన చదువు గురించి చాలా గర్వపడుతుండేది. నాలాంటి చదువులేని స్త్రీకి జ్ఞాన సంపన్నుడైన పండితుడైన భర్త దొరికాడు అని నిరంతరం ఆమె ఆనందంతో గౌరవ భావనతో ఉండేది.

బాబాసాహెబ్ జీవితంలోని గొప్పదనం ఏమంటే ఆయన ప్రొఫెసర్ అయిన తర్వాత కూడా ఇంప్రూవ్‌మెంట్ ట్రస్ట్ (రాజకీయ విభాగపు పేరు) కోసం ఇంట్లో రెండు గదులు కేటాయించి నడిపేవాడు. తర్వాత బాబాసాహెబ్ అమెరికా వెళ్ళిన సమయంలో రమాబాయి తన భర్త భద్రతకోసం, క్షేమంకోసం రాత్రింబవళ్ళు ప్రార్థన చేస్తూ ఉండేది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1040**

* * *